సీఎం జగన్ మహిళా పక్షపాతి

● ఆసరా సంబరాల్లో ఎమ్మెల్యేలు అప్పలనరసయ్య, శ్రీనివాసరావు


జామిలో ఆసరా సంబరాలకు హాజరైన మహిళలు


గంట్యాడలో మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య


గంట్యాడలో హాజరైన మహిళల్లో ఓ భాగం

గంట్యాడ/ జామి: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని గజపతినగరం, ఎస్.కోట ఎమ్మెల్యేలు బొత్స అప్పలనరసయ్య, కడుబండి శ్రీనివాసరావు అన్నారు. గంట్యాడ మండలంలోని కొఠారుబిల్లి జంక్షన్‌లోని కనకదుర్గమ్మ గుడి పక్కన మైదానంలో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా మూడోవిడత సంబరాలకు అతిథిగా ఎమ్మెల్యే అప్పలనరసయ్య , జామి మండల కేంద్రంలో నిర్వహించిన సంబరాలకు అప్పలనరసయ్యతో పాటు ఎమ్మెల్యే కడుబండి అతిథులుగా హాజరయ్యారు. వేర్వేరుగా నిర్వహించిన సభల్లోవారు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల్లో సీఎం జగన్ ఇప్పటికే 98 శాతం అమలు చేశారని తెలిపారు. ఇంటికి ఆర్థిక క్రమశిక్షణ ఇచ్చే ఇల్లాలికి అండగా ఉండేందుకు పలు పథకాలను ప్రవేశపెట్టి, పారదర్శకంగా అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రతిప్రక్ష నేతగా జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసే సమయంలో తాము అధికారంలోకి వస్తే 2019 నాటికి డ్వాక్రా సంఘాలకు ఎంత రుణాలు ఉంటే అంత మొత్తాన్ని నాలుగు విడతల్లో చెల్లిస్తామని మాట ఇచ్చారని గుర్తు చేశారు. చెప్పిన విధంగానే అధికారంలోకి వచ్చాక మూడో విడతలకు సంబంధించిన డబ్బులు అక్కచెల్లెమ్మల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందని తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు వడ్డీ రేటు తగ్గించి అండగా ఉంటున్నామని తెలిపారు. జగన్ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ఇంటిమీద ఏ పార్టీ జెండా ఉందో చూడడం లేదు, రేపు మాకు ఓటు వేస్తారో లేదో చూడడం లేదు, అర్హులైన లబ్ధిదారుల కళ్లలో ఆనందం చూడాలన్నదే తమ ప్రభుత్వ సిద్ధాంతమని అన్నారు. రాజకీయాల్లో, నామినేటెడ్ పదవుల్లో మహిళలకు 55 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కోట్ల రూపాయలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. ప్రభుత్వ బడుల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టి పేదపిల్లలకు కూడా కార్పొరేట్ తరహా విద్య అందిస్తున్నామని చెప్పారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా అవినీతి లేకుండా పథకాలు అందిస్తున్నామని అన్నారు. పేదవారి బాగుకోసం పరితపించే జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

చంద్రబాబు మోసకారి

2014 ఎన్నికలకు ముందు జాబు రావాలంటే బాబు రావాలన్నారని, టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చిందో చెప్పాలని ఎమ్మెల్యేలు ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని చెప్పి మహిళలను చంద్రబాబు మోసం చేశారని గుర్తు చేశారు. చంద్రబాబును మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి ఎల్లోమీడియా విశ్వ ప్రయత్నం చేస్తోందని, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలపై దుష్ప్రచారం చేస్తోందని అన్నారు. ఎల్లో మీడియాను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ నా యకులు ప్రజాధనాన్ని దోచుకున్నారే తప్ప పేదల గురించి వారు ఏనాడూ ఆలోచించలేదని, డీలర్, అంగన్‌వాడీ పోస్టులను అమ్ముకున్నారని ఆరోపించారు. కొఠారుబిల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో గంట్యాడ మండలంలోని 1,368 పొదుపు సంఘాల్లోని 14, 935 మంది మహిళలకు ఆసరా మూడో విడత కింద మంజూరైన రూ.9.23 కోట్ల చెక్కును ఎమ్మెల్యే అప్పలనరసయ్య అందజేశారు. వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కళ్లద్దాలను పంపిణీ చేశారు. వెలుగు ఆధ్వర్యంలో మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను, చిరుధాన్యాలతో ఐసీడీఎస్ సిబ్బంది తయారు చేసిన వంటకాలను పరిశీలించారు. కేజీబీవీ విద్యార్థినుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. జామి మండలంలోని డ్వాక్రా సంఘాలకు మంజూరైన ఆసరా మూడో విడత నిధులకు సంబంధించిన రూ.8.72 కోట్ల చెక్కును మహిళలకు ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎమ్మెల్యే కడుబండి అందజేశారు. అలాగే విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. గంట్యాడ ఎంపీపీ పీరుబండి హైమావతి, జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహిందకుమార్, సర్పంచ్ వేమలి రమణమ్మ, ఎంపీటీసీ గులిపల్లి మంగ మ్మ, నాయకులు నారాయణమూర్తిరాజు, లచ్చిరెడ్డి కృష్ణ, పి.నారాయణమూర్తి, రంధిరాము, రామసూర్యం, జాగరపు సత్యారావు, జామి ఎంపీపీ సబ్బవరపు అరుణ, జెడ్పీటీసీ గొర్లె సరయు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, రాష్ట్ర గ్రీనింగ్ అండ్‌బ్యూటిఫికేషన్ డైరెక్టర్ చలుమూరి సత్యారావు, డీసీసీబీ డైరెక్టర్ పాండ్రంకి సంజీవి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు గుడివాడ రాజేశ్వరరావు, వైస్ ఎంపీపీలు ఎన్నింటి విజయలక్ష్మి, గేదెల వెంకటరావు, సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, వెలుగు ఏరియా కో–ఆర్డినేటర్ జ యశ్రీ, ఎంపీడీఓ సతీష్, తహసీల్దార్ హేమంత్‌కుమార్, వెలుగు ఏపీఎం మధుమహేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సచివాలయాల్లో తనిఖీలు


వి.కృష్ణాపురం సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ నిర్మలాదేవి

దత్తిరాజేరు: మండలంలోని వి.కృష్ణాపురం, వంగర గ్రామ సచివాలయాల్లో డీపీఓ నిర్మలాదేవి మంగళవారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, సిబ్బంది హాజరు పరిశీలించారు. రెండు సచివాలయాల్లోనూ ఈ– సర్వీసుల ద్వారా ఎక్కువ ఆదాయం రావడంతో సిబ్బందిని అభినందించారు. సచివాలయాలకు వచ్చే ప్రజలతో గౌరవంగా నడుచుకుని, వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అంతకు ముందు కోమటిల్లిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రం నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసి, సర్పంచ్‌ను, పంచాయతీ సిబ్బందిని అభినందించారు.

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ


విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం గీతారాణి

బొండపల్లి: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఒంపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇదివరకు వైద్య సిబ్బంది నేత్ర పరీక్షలు చేసి 17 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. ప్రభుత్వం వీరికి సమకూర్చిన కళ్లద్దాలను హెచ్‌ఎం కె.గీతారాణి మంగళవారం పంపిణీ చేశారు. ఉపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ బి.వి.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సత్యాగ్రహ ర్యాలీ


సత్యాగ్రహ ర్యాలీ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

శృంగవరపుకోట: దేశంలో స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకు బీజేపీ పాతర వేసి కేంద్రంలో నిరంకుశ ప్రభుత్వాన్ని నడుపుతోందని కాంగ్రెస్ నాయకులు ధ్వజమెత్తారు. మంగళవారం ఉదయం ఎస్.కోట పట్టణంలో జై భారత్ సత్యాగ్రహ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సరగడ రమేష్‌కుమార్ నేతృత్వంలో సత్యాగ్రహర్యాలీ చేశారు. రమేష్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన వారిపై ఈడీ సీబీఐలను ప్రయోగించి వారిపై ఒత్తిళ్లు తెచ్చి గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రాహుల్‌గాంధీపై అక్రమ కేసులు పెట్టి, దేశన్యాయ వ్యవస్థను సైతం తన గుప్పిట్లో ఉంచుకుని తమకు తగ్గట్లుగా తీర్పులు చెప్పిస్తూ ప్రజాస్వామ్యాన్ని నిరంకుశ రాజకీయ వ్యవస్థగా ప్రధాని మోడీ మార్చారన్నారు. రాహుల్‌గాంధీ లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేసి పార్లమెంట్‌లో ప్రతిపక్షం లేకుండా చేయాలని ప్రధాని మోడీ ఆలోచన చేస్తున్నారన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలంతా గొంతు విప్పాల్సిన అవసరం ఉందన్నారు. డీసీసీ అధ్యక్షులు రమేష్‌కుమార్, పదాల మణిబాబు, హెచ్.నానాజీ, బంగారునాయుడు పాల్గొన్నారు.

బాలసదన్‌లో ప్రవేశాలు


మాట్లాడుతున్న బాలసదన్ వసతి గృహ సంక్షేమాధికారి

గజపతినగరం: గజపతినగరం బాలసదన్ వసతి గృహంలో చేరేందుకు ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని బాలసదన్ వసతి గృహ సంక్షేమాధికారి ఆర్.సంధ్య కోరారు. స్థానిక విలేకరులతో ఆమె మంగళవారం మాట్లాడారు. వసతి గృహంలో ఉచిత భోజనవసతి సదుపాయాలతో కూడిన విద్యాబోధన జరుగుతుందన్నారు. ఒకటి నుంచి 5వ తరగతి వరకు చదివిన పిల్లలు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు.

'కిల్‌కారీ' ద్వారా ఆరోగ్య సూచనలు


మాట్లాడుతున్న వైద్యాధికారి అజయ్‌కుమార్

మెరకముడిదాం: మాతాశిశు మరణాల నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని గర్భాం పీహెచ్‌సీ వైద్యాధికారి అజయ్‌కుమార్ అన్నారు. పీహెచ్‌సీలో ఆశ వర్కర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిల్‌కారీ అనే వినూత్న కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని చెప్పారు. ఏఎన్‌ఎంలు తమ పరిధిలోని గర్భవతుల వివరాలు, వారి ఫోన్ నంబర్లను నమోదు చేస్తారని తెలిపారు. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం అయిన ఏడాది వరకు మొత్తం 72 సార్లు ఫోన్ల ద్వారా ఆరోగ్యసూత్రాలను వివరిస్తూ వాయిస్‌కాల్స్ వస్తాయని తెలిపారు.గర్భవతులు ఈ ఫోన్ కాల్స్ వినేలా అవగాహన కల్పించాలని సూచించారు. పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేతో భూసమస్యలకు పరిష్కారం


గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసరావు

లక్కవరపుకోట: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర భూరీసర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కూర్మవరం గ్రామంలో రీసర్వే నిర్వహించనున్న నేపథ్యంలో తహసీల్దార్ టి.రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ దశాబ్దాల క్రితం భూసర్వే నిర్వహించారని, మళ్లీ ఇన్నాళ్లకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సర్వే చేయిస్తున్నారని చెప్పారు. సర్వే చేసే సమయంలో రైతులంతా పొలాల వద్ద ఉండి రెవెన్యూ, సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. మండల సర్వేయర్ గ్రంధి రామం, డీటీ రాజేశ్వరరావు, వైస్ ఎంపీపీ ఆవాల శ్యామల, ఉపసర్పంచ్ దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గజపతినగరం: జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా గజపతినగరం టౌన్‌కు బుధవారం ఉదయం 8గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్‌శాఖ డీఈ శివకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గజపతినగరం టౌన్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సంబంధిత పనులు చేపట్టనుండడంతో సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన

గుర్ల: మండలంలోని చుక్కపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు మంగళవారం సందర్శించారు. చిన్నారులు హాజరు,పౌష్టికాహారం పంపిణీకి సంబంధించిన రికార్డుల నిర్వహణ సరిగా లేకపోవడంతో అంగన్‌వాడీ కార్యకర్తలపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. మహిళా పోలీసులు అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీలు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం గుర్ల కేజీబీవీని సందర్శించారు.

ఆశీల వేలం పాట

వేపాడ: మండల కేంద్రం వేపాడ, వల్లంపూడి గ్రామపంచాయతీల్లో రోజు వారీ మార్కెట్ ఆశీల వేలం పాటను ఆయా గ్రామసర్పంచ్‌లు మిరపాక అర్జునమ్మ, రుద్ర అంజలి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు భాగ్యలక్ష్మి, ధనలక్ష్మి మంగళవారం నిర్వహించారు. వేపాడ పంచాయతీ వేలం పాట రూ. 42,500 కు, వల్లంపూడి పంచాయతీ వేలం పాట రూ.45,000కు గుత్తేదారులు పాడుకున్నట్లు చెప్పారు. ఈఓపీఆర్డీ సీహెచ్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

బాల్యవివాహాలను నిర్మూలిద్దాం


చీపురుపల్లిరూరల్(గరివిడి): మాట్లాడుతున్న బాలలహక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ అప్పారావు

చీపురుపల్లిరూరల్ (గరివిడి): బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులకు సూచించారు. గరివిడి మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిషేధం , బాలల హక్కుల పరిరక్షణ అంశాలపై, మిషన్ వాత్సల్య పథకంపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులతో పాటు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతోనే బాల్యవివాహాల నిర్మూలన సాధ్యమని అన్నారు. బాల్యవివాహాలతో ఆడపిల్లలకు ఎదురయ్యే ఇబ్బందులను వివరించారు. గ్రామాల్లో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే సచివాలయ మహిళా పోలీసులు, గ్రామ వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పోలీసులు, చైల్డ్ లైన్‌కు సమాచారం అందించాలని సూచించారు. మిషన్ వాత్సల్య పథకానికి అర్హత ఉన్న పిల్లలతో దరఖాస్తులు చేయించాలని కోరారు. మండల ప్రత్యేకాధికారి వై.వి.రమణ, తహసీల్దార్ టి.గోవింద్, ఇన్‌చార్జి ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఎంఈఓ పి.రామారావు, ఐసీడీఎస్ పీఓ ఆరుద్ర, జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములనాయుడు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పొన్నాడ కుమార్, పలువురు సర్పంచులు,ఎంపీటీసీలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అవగాహన కల్పించండి

దత్తిరాజేరు: బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి, బాల్యవివాహాల నిర్మూలనకు ఆశ కార్యకర్తలు కృషి చేయాలని దత్తిరాజేరు, కె.కొత్తవలస పీహెచ్‌సీల వైద్యాధికారులు ఆనంద్‌కుమార్, సంతోషిరూప సూచించారు. ఆయా పీహెచ్‌సీల్లో ఆశ కార్యకర్తలతో మంగళవారం వారు వేర్వురుగా సమావేశాలు నిర్వహించారు. 18 ఏళ్లు నిండకుండా ఆడపిల్లలకు పెళ్లి చేయవద్దని, వారిని చదివించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు.

పింఛన్ల పంపిణీ 95 శాతం పూర్తి


దత్తిరాజేరు: గడసాంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి రూ.10 వేల పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ దీపిక


బొండపల్లి: విశాఖలోని ఆస్పత్రిలో సన్యాసికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అనూష

దత్తిరాజేరు: మండల వ్యాప్తంగా ఏప్రిల్ నెలకు సంబంధించిన సామాజిక పింఛన్ల పంపిణీ 95 శాతం పూర్తయిందని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం మంగళవారం తెలిపారు.17 సచివాలయాల పరిధిలో గ్రామ వలంటీర్లు సోమవారం సాయంత్రం నుంచి పింఛన్ల పంపిణీ చేశారని చెప్పారు. గడసాం, కన్నాం , సరయ్యవలస, షికారుగంజి, తదితర గ్రామాల్లో 45 మంది దివ్యాంగులకు కొత్తగా మంజూరైన పింఛన్లను ఆయా గ్రామాల సర్పంచ్‌లు పంపిణీ చేశారు. గడసాంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుడు కనక తాతకు మంజూరైన రూ. 10 వేల పింఛన్‌ను సర్పంచ్ నేతేటి దీపిక వలంటీర్ల తో కలిసి అందజేశారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామానికి చెందిన మీసాల సన్యాసి అనారోగ్యంతో కొద్ది రోజులుగా విశాఖపట్నంలోని ఎస్ఆర్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు ఏప్రిల్ నెలకు సంబంధించిన వృద్ధాప్య పింఛన్‌ను గ్రామ వలంటీర్ తాత్రాజు అనూష మంగళవారం ఆ ఆస్పత్రికి వెళ్లి అందజేశారు.

'మిషన్ వాత్సల్య'పై అవగాహన కల్పించండి


మాట్లాడుతున్న ఎంపీపీ చలం నాయుడు

బొండపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా అమలు చేస్తున్న 'మిషన్‌వాత్సల్య' పథకంపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎంపీపీ చల్ల చలంనాయుడు ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలకు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సఖి గ్రూపుల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ అనాథులు, నిస్సహాయులు, తల్లి,లేదా తండ్రి లేని 18 ఏళ్ల లోపు పిల్లల కోసం మిషన్ వాత్సల్య పథకం అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ పథకానికి అర్హత ఉన్నవారిని గుర్తించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందన్నారు. అర్హులను గుర్తించి వారికి, కావాల్సిన పత్రాలన్నింటినీ జతచేసి ఏప్రిల్ 15 లోగా వారితో దరఖాస్తు చేయించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో ఎక్కడా గర్భిణులు, బాలింతలకు రక్తహీనత సమస్య రాకుండా చూడాలన్నారు.బాల్య వివాహాలను నియంత్రించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రతి గ్రామంలో 9 నుంచి 21 ఏళ్ల లోపు ఆడ పిల్లలతో సఖి గ్రూ పులు ఏర్పాటు చేయాలని చెప్పారు. మండల ప్రత్యే క అధికారి ఎస్.వి.కె.దుర్గాప్రసాద్, ఎంపీడీఓ ఏ.వేదవతి, ఐసీడీఎస్ పీఓ ఉమామహేశ్వరి, దేవుపల్లి,బొండపల్లి పీహెచ్‌సీల వైద్యాధికారులు సత్యవతి, ఎల్.సత్యనారాయణ, అమృతవల్లి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీసీ కాలువ నిర్మాణానికి రూ.10 లక్షలు


కాలువ పనులకు భూమి పూజ చేస్తున్న నాయకులు

చీపురుపల్లిరూరల్: మండలంలోని పేరిపి గ్రామంలో సీసీ కాలువ నిర్మాణానికి ఎంపీ గ్రాంట్ నుంచి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. కాలువ నిర్మాణ పనులకు వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఇప్పిలి అనంతం, పార్టీ మండల అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు మంగళవారం భూమి పూజ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తన ఎంపీ ల్యాడ్ నిధుల నుంచి రూ.10 లక్షలు కాలువ నిర్మాణానికి మంజూరు చేశారని చెప్పారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. సర్పంచ్ కోరాడ పృథ్వీ, ఎంపీటీసీ కరణం చిన్నంనాయుడు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కోరాడ నారాయణరావు, జేసీఎస్ మండల కన్వీనర్ సువ్వాడ అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా వెదుళ్ల పైడిమాంబ పండగ


కొత్తవలస: పైడిమాంబ ఆలయం వద్ద ఘటాలతో భక్తులు


బొండపల్లి: రాజరాజేశ్వరీదేవి ఆలయానికి మొక్కులు చెల్లించుకునేందుకు ప్రభలతో వచ్చిన భక్తులు

కొత్తవలస: మండలలోని వీరభద్రపురం గ్రామంలో వెదుళ్ల పైడిమాంబ పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వీరభద్రపురంతో పాటు తుమ్మికాపల్లి, కర్రి చిన్నయ్యపాలెం, దాసరవానిపాలెం, వియ్యంపేట, కొటానివానిపాలెం, గొల్లపేట గ్రామాల వారు కలిసి ఈ పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అనుపోత్సవం సందర్భంగా అమ్మవారి ప్రతిమలను, ఘటాలను మేళతాళాల మధ్య వైభవంగా ఊరేగించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ బాలసూర్యారావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రాజరాజేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గ్రామంలో రాజరాజేశ్వరీదేవి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు పక్క గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారి ప్రభలు, ఘటాలతో ఆలయానికి తరలి వచ్చి మొక్కలు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ధూసి శ్రీధర్ శర్మ భక్తులతో పూజలు చేయించారు.

దివ్యాంగులకు బస్సు పాసుల జారీ


దివ్యాంగులకు బస్సు పాసులు అందిస్తున్న ఎస్.కోట డిపో సూపరింటెండెంట్ వెంకటరావు

కొత్తవలస: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎస్.కోట ఆర్టీసీ డిపో మేనేజర్ కె.రమేష్ ఆధ్వర్యంలో దివ్యాంగులు, విభిన్న ప్రతిభావంత విద్యార్థులకు ఉచిత బస్సు పాసుల జారీ శిబిరం మంగళవారం నిర్వహించారు. శిబిరంలో సింహాచలం,ఎస్.కోట డిపోలకు చెందిన అధికారులు 54 పల్లెవెలుగు బస్సు పాసులు, 65 సిటీ బస్సు పాసులు అందజేశారు. ఎస్.కోట డిపో సూపరింటెండెంట్ చుక్క వెంకటరావు మాట్లాడుతూ ఎస్.కోట నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి మూడు సంవత్సరాలు చెల్లుబాటు అయ్యేలా దివ్యాంగులకు బస్సు పాసులు అందించామని చెప్పారు. గతంలో ఏడాది కాలపరిమితికే పాసులు అందజేసేవారమని తెలిపారు. ఎస్.కోట డిపో పరిధిలో గతేడాది జూన్ నుంచి నేటి వరకు 334 మందికి, దివ్యాంగుల సహాయకులు 63 మందికి పాసులు అందజేశామని చెప్పారు. సింహాచలం డిపో సూపర్‌వైజర్ ఎస్.రామారావు పాల్గొన్నారు.

క్షయ రోగులకు పౌష్టికాహారం అందజేత


ఎస్.కోటలో పౌష్టికాహారం అందజేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

శృంగవరపుకోట: అరబిందో ఫార్మసీ, హెటిరో డ్రగ్స్ సహకారంతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద కొట్టాం, పి.ఎం.పాలెం, జామి, అలమండ, గంట్యాడ పీహెచ్‌సీల పరిధిలోని క్షయరోగులకు మంగళవారం పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. కొట్టాం పీహెచ్‌సీ వైద్యాధికారుల నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్లు శంకరరావు, రామకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

దేవుపల్లిలో..

బొండపల్లి: దేవుపల్లి పీహెచ్‌సీ పరిధిలోని ఆరుగురు క్షయరోగులకు అరబిందో ఫౌండేషన్ సహకారంతో పౌష్టికాహార కిట్లను వైద్యాధికారి సత్యవతి ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. ఆశడే సందర్భంగా ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ బి.నారాయణప్పలనాయుడు పాల్గొన్నారు.

జామిలో..

జామి: క్షయవ్యాధి గ్రస్తులకు స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారి భాగ్యరేఖ పౌష్టికాహారం పంపిణీ చేశారు. అనంతరం ఆశ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి, వారికి ఆరోగ్య జాగ్రత్తలు వివరించడంతో పాటు, ప్రసవానికి ఆస్పత్రికి తరలించడంలో ఆశ కార్యకర్తలు బాధ్యత తీసుకోవాలని వైద్యాధికారి అన్నారు. వైద్యాధికారి వనజ,హెల్త్ ఎడ్యుకేటర్ అనిల్ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

పథకాలపై విస్తృత ప్రచారం చేయండి

అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మెరకముడిదాం, లక్కవరపుకోట, వేపాడ, చీపురుపల్లి, గరివిడి, గజపతినగరం, గుర్ల మండాల్లోని పలు గ్రామాల్లో గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లతో జిల్లా, మండలస్థాయి వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం సమావేశాలు నిర్వహించారు. ఈనెల 7వ తేదీ నుంచి నిర్వహించనున్న 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంపై దిశా నిర్దేశం చేశారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాలు, చేకూర్చిన లబ్ధిని, చేపట్టిన అభివృద్ధి పనులను వివరించాలని సూచించారు. అనంతరం జగనన్నే మా భవిష్యత్ కిట్లను పంపిణీ చేశారు.

– మెరకముడిదాం, లక్కవరపుకోట, వేపాడ, చీపురుపల్లిరూరల్, గజపతినగరం రూరల్, గుర్ల


మెరకముడిదాం: మెరకముడిదాంలో గృహసారథులకు 'జగనన్నే మా భవిష్యత్' కిట్ అందజేస్తున్న నాయకులు


వేపాడ: శింగరాయిలో గృహసారథులకు కిట్లు అందజేస్తున్న ఎంపీపీ సత్యవంతుడు తదితరులు


లక్కవరపుకోట: జగనన్నే మా భవిషత్ కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ వరలక్ష్మి, ఎంపీపీ శ్రీనివాసరావు


చీపురుపల్లిరూరల్: జి.ములగాంలో కిట్లు పంపిణీ చేస్తున్న చీపురుపల్లి మండల నాయకులు


చీపురుపల్లిరూరల్: గరివిడి మండలం తొండ్రంగిలో కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు


గుర్ల: గుర్లలో కిట్లు అందజేస్తున్న నాయకులు